ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

నత్తకు నడకలు నేర్పేలా..



● అర్థాంతరంగా ఆగిన ట్యాంకు నిర్మాణం

- ఏళ్లుగా సాగుతున్న తాగునీటి పథకం పనులు
- భారీగా పెరిగిన అంచనా వ్యయం
- ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులే..!

6

పల్లెల్లో ప్రశాంతంగా గడపండి: ఎస్పీ రత్న



గ్రామ సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ రత్న

ముదిగుబ్బ, ఏప్రిల్ 10(ఆంధ్ర జ్యోతి): క్షక్షలు వీడి గ్రామాలలో ప్రశాంతమైన జీవితం గడపాలని ఎస్పీ రత్న సూచించారు. ముదిగుబ్బ మండల పరిధిలోని మంగళ మడకలో 'గ్రామ సందర్శన.. నేర నియంత్రణ' కార్యక్రమంలో గురువారం రాత్రి ఆమె పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరూ కలసి మెలసి ఉండాలని, ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని సూచించారు. గొడవలు, హత్యల జోలికి వెళితే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని అన్నారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. నేరాలు, నూతన చట్టాల గురించి ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. నూతన చట్టాలు, సైబర్ నేరాల గురించి షార్ట్ ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించారు. మహిళలకు డయల్ 112, 100 గురించి వివరించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం నాటిక, పాటల ప్రదర్శన నిర్వహించారు. ఎస్పీ రత్న పల్లె నిద్ర చేపట్టారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్యామ్ రావ్, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

బండమీదపల్లి.. పాడిలో మేటి



- రోజూ 8 వేల లీటర్లు డెయిరీకి సరఫరా
- జిల్లాలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి
- ఎక్కువ మందికి జీవనాధారం

6

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్ విధానంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలించడం, రోడ్డుభద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు.



పాలసముద్రం వద్ద లిక్కర్ గోడౌన్ ప్రారంభోత్సవంలో మంత్రులు కొల్లు, సవిత, ఎమ్మెల్యేలు సింధూర, రాజు, కందికుంట, మాజీ మంత్రి పల్లె తదితరులు

రాష్ట్రంలో ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం

నాసిరకం మద్యంతో దోచుకున్నారు

- దీని వెనుక ఎవరున్నా వదిలిపెట్టం
- నూతన విధానంతో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- అనంత, పాలసముద్రం వద్ద గోడౌన్ల ప్రారంభం

అనంతపురం రూరల్/గోరంట్ల ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీని వెనుక ఎంతటివారున్నా వదిలిపెట్టేది లేదని అన్నారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని సోములదొడ్డి వద్ద రూ.11.10 కోట్లతో నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్‌ను, శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద మద్యం డిపోను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. సెబ్‌ను 70 శాతం ఎక్సైజ్ సిబ్బందితో ఏర్పాటు చేసి, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను లేకుండా చేశారని అన్నారు. ప్రముఖ బ్రాండ్లను తప్పించి, వైసీపీ వారి బ్రాండ్లను కొత్త పేర్లతో విక్రయించారని అన్నారు. జె బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాడాక సెబ్‌ను రద్దుచేసి, ఎక్సైజ్ శాఖను ఒకటిగా చేశామని అన్నారు. సీఎంతో మాట్లాడి, ఎక్సైజ్ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో 29 మద్యం డిపోలు ఉండగా, వైసీపీ ప్రభుత్వం 10 మద్యం డిపోల ఆదాయాన్ని తాకట్టుపెట్టి రూ.23 కోట్ల రుణం తీసుకుందని అన్నారు. సిట్‌ను ఏర్పాటు చేసి.. గత ప్రభుత్వంలో మద్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలను వెలికి తీస్తున్నామని తెలిపారు. కొత్త మద్యం పాలసీతో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

(మిగతా 7లో...)

దెబ్బకొట్టిన బంగినపల్లి

- రుతు సమయంలో సోకిన ఊజి
- పూత విరగబూసినా నిలబడని పంట
- రెండో ఏడాదీ రైతులకు తప్పని నష్టాలు

పేనుబంకతో మాయమైన పండు

కాయలే లేని బంగినపల్లి రకం చెట్టు



నంబులపూలకుంట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మామిడిలో రారాజుగా గుర్తింపు పొందిన బంగినపల్లి రకం మార్కెట్‌లో తక్కువగా కనిపిస్తోంది. బేనిషాగా పిలుచుకునే ఈ రకం చెట్లకు పూత విరగ్గాసినా.. పిందె సమయంలో పేనుబంక ఆశించడంతో ఎక్కువగా రాలిపోయింది. పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. కదిరి డివిజన్‌లో ఐదువేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. నంబులపూలకుంట మండలంలో 805 ఎకరాలు, తలుపుల 2,178, గాండ్లపెంట 743, కదిరి 632, తనకల్లు 399, నల్లచెరువు 257 ఎకరాల్లో మామిడిని సాగుచేశారు. పంట ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు దాకా ఏటా ధర పలుకుతుంటుంది. కానీ ఈసారి దిగుబడి లేకపోవడంతో వ్యాపారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కాస్త అడ్వాన్సు ఇచ్చినవారు ఇప్పుడు రైతుకు ముఖం చాటేస్తున్నారు. అరకొర దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కేసరి, లాల్‌బార్, మల్లూబా రకాలు కూడా అరకొరగానే కనిపిస్తున్నాయి. సీజన్లక చివరగా వచ్చే నీలం కాయలకు ఆశించిన స్థాయిలో ధరలు ఉండవు. వాటి దిగుబడి కూడా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో లేదు. బెంగళూరు రకం ఈ ప్రాంతంలో తక్కువగా ఉంది. వీటిని ఎక్కువగా జ్యూస్ తయారీకి వినియోగిస్తారు. కానీ విదేశాలకు సైతం ఎగుమతి అయ్యే బంగినపల్లికి ఎప్పుడూ మంచి ధర లభిస్తుంది. ఆ పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

బంగినపల్లి మామిడికి 'ఆన్ ఇయర్.. ఆఫ్ ఇయర్' పంటగా పేరుంది. చెట్టు స్వభావం కారణంగా ఒక ఏడాది మంచి దిగుబడి, మరుసటి ఏడాది తక్కువ దిగుబడి వస్తుంది. గత ఏడాది జిల్లాలో ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు. వచ్చిన కాస్త పంటకు ఊజి సోకడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాదిపై ఆశలు పెట్టుకుంటే.. పూర్తిగా కనుమరుగైంది. ఈ ఏడాది జనవరిలో మామిడికి పూత అధికంగా వచ్చింది. తెల్లపూత దశలో మందులు పిచికారీ చేయకూడదని

పూత దశలో పొరపాటు

చెప్పినా రైతులు వినిపించుకోలేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. పూత రాలుతోందని ఒకటికి రెండుమార్లు రైతులు మందులు పిచికారీ చేశారు. తెల్లపూత దశలో తేనేటీగలు ఆశిస్తాయి. ఆ సమయంలో మందులు పిచికారీ చేస్తే తేనేటీగలు వాలవు. దీంతో పేనుబంక అధికమై పూత పూర్తిగా రాలిపోయింది. రైతులు చేసిన ఈ పొరపాటు కారణంగా దిగుబడి ఏమాత్రం లేకుండా పోయిందని అంటున్నారు. దీనికితోడు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. జనవరిలో పూత పూయడం, ఫిబ్రవరి, మార్చిలో తెల్లవారు జామున చలివాతావరణం ఉండటంతో పంట పూర్తిగా దెబ్బతిందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

పద్ధతులు పాటించాలి

మామిడి పంట ఏటా జూన్, జూలైనాటికి పూర్తి అవుతుంది. కాయలు కోసే సమయంలో తొడిమలేకుండా చూసుకోవాలి. కోత పూర్తి అయిన వారానికి కత్తిరింపులు చేయాలి. చెట్లకు కిందిభాగాన కొమ్మలు, పక్క కొమ్మకు వచ్చిన అదనపు కొమ్మలు, కాండం వద్ద ఉన్న కొమ్మలను పూర్తిగా తొలగించాలి. నెల తరువాత పేడ ఎరువుతో పొటాష్, యూరియా, సూపర్, కంపోస్టు ఎరువులను చెట్టుకు అందించాలి. పూతకొచ్చే సమయంలో ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల యూరియా, కాపర్ ఆక్సిక్లోరైడ్ మోతాదులతో పిచికారీ చేయాలి. అప్పుడే చెట్టుకు పూత అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. పూత దశవరకు.. (అక్టోబరు, నవంబరు, డిసెంబరు) కనీసం రెండు డోసులు పైమందులు ఇవ్వాలి. తద్వారా పూత బాగా రావడంతోపాటు చెట్టుకున్న పురుగులు చనిపోతాయి. ఆకులు ముడతలు లేకుండా కాంతివంతంగా ఉంటాయి. పూత దశలో చెట్టుకు నీరు అందిస్తూ ఉండాలి. పిచికారీ మందులు తగ్గించి, చెట్టు ఎదుగుదలకు ఎరువులు అందించాలి. అప్పుడే మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మందులు పిచికారీచేసే ప్రతిసారీ వేపనూనె కలిపితే.. తేనెమంచు, రసం పీల్చే పురుగులు, ఫంగస్ నుంచి పంటను కాపాడుకోవచ్చు. ఈ పద్ధతులు పాటిస్తే మామిడిలో మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

థైవాన్ జామతో ఊజి

థైవాన్ జామను సాగుచేయడంతో ఊజీ ఉత్పత్తి అయింది. బంగినపల్లి మామిడిని ఊజి ఎక్కువగా ఆశిస్తుంది. పండు పండే (రుతు) సమయంలో ఊజి ఆశించడం వల్ల పండు లోపల పురుగులు ఉత్పత్తి అవుతున్నాయి. గత ఏడాది ఊజితోనే రైతులు నష్టపోయారు. దీనికి బుట్టలు ఏర్పాటు చేసుకోవాల్సిందేనని, మందులు లేవని, కాయ కాయకు రక్షక బుట్టలు ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలు అంటున్నారు.

రూ.20 లక్షలకు అమ్మేశా...



12 ఎకరాల మామిడి తోటను రూ.20 లక్షలకు అమ్మాను. ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. మాట్లాడిన ధరలు వచ్చే పరిస్థితి లేదు. కష్టమైనా, నష్టమైనా పంటను సంరక్షించుకుంటున్నాం.

-భాస్కర్‌రెడ్డి, ఎగువపల్లి



నంబులపూలకుంటలో మామిడి తోట

రూ.2 లక్షలు ఖర్చు చేశా..



నాలుగు ఎకరాల్లో మామిడికి ఇప్పటికి రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశాను. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. దిగుబడి గత ఏడాది కంటే చాలా తగ్గిపోయింది. బేనిషా రకం రైతులు రెండు సంవత్సరాలు పూర్తిగా నష్టపోతున్నాం.

-నాగార్జునరెడ్డి, దిగువపల్లి

పద్ధతులు పాటించాలి..

మామిడి రైతులు పద్ధతులు పాటిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పేనుబంక కారణంగా మామిడి పంట దెబ్బతినింది. తెల్లపూత సమయంలో మందులు పిచికారీ చేయకూడదు.

-ప్రతాప్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, కదిరి

హోం వర్క్ చేయలేదని చెప్పుతో కొట్టిన టీచర్



చెప్పు చూపుతున్న టీచర్ అనిత

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హోంవర్క్ చేయలేదని పట్టణంలోని జీనియస్ పాఠశాలలో విద్యార్థులను ఓ టీచర్ గురువారం చెప్పుతో కొట్టారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వెళ్లి టీచర్‌ను చితకబాదారు. జీనియస్ పాఠశాలలో గొట్లూరు విద్యార్థులు ముగ్గురు రెండో తరగతి చదువుతున్నారు. రెండు రోజుల క్రితం టీచర్‌గా చేరిన అనిత, ముగ్గురు విద్యార్థులు హోంవర్క్ చేయలేదని దుర్భాషలాడారు. విచక్షణ కోల్పోయి చెప్పుతో కొట్టారు. బడి వదిలాక ఇంటికి వెళ్లిన విద్యార్థులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో వారు పాఠశాల వద్దకు వచ్చి అనితను ప్రశ్నించారు. అనుకోకుండా జరిగిందని ఆమె అన్నారు. అయినా తల్లిదండ్రులు శాంతిచకపోవడంతో వారిపైనా అనిత చెప్పు ఎత్తారు. దీంతో తల్లిదండ్రులు ఆమెను చితకబాదారు. కరస్పాండెంట్ ప్రేమ్ కిశోర్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాలకు వెళ్లి విచారించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో యాజమాన్యం, టీచర్ అనితపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

సంతలో సుంకాల దోపిడీ

- సోమందేపల్లిలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- అధికంగా వసూలు
- తిరగబడ్డ వ్యాపారులు
- పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన వ్యాపారులు

సోమందేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వారపు సంతలో కాంట్రాక్టర్ సుంకాల దోపిడీకి తెరలేపాడు. గురువారం నిర్వహించిన సంతలో వ్యాపారులపై దౌర్జన్యానికి దిగాడు. అధిక మొత్తంలో సుంకాల వసూలుకు పూనుకున్నాడు. దీంతో వ్యాపారులు తిరగబడ్డారు. పంచాయతీ కార్యాలయానికి చేరుకుని, ధర్నాకు దిగారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుతో వాగ్వాదానికి దిగారు. ఇటీవల 2025-26 సంవత్సరానికిగాను సంతలో సుంకాల వసూలుకు పంచాయతీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వారపుసంతను హరి రూ.1.87 లక్షలకు, బస్టాండును రూ.63 వేలకు నాగేంద్ర దక్కించుకున్నారు. గెజిట్‌లో పొందుపరిచిన ధరలకంటే అధిక మొత్తంలో వసూలుకు దిగడంతో సంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు ప్రతిఘటించారు. గతంలో కంటే రెండింతలు అధికంగా డిమాండ్ చేయడంతో వారు మండిపడ్డారు. అడిగినంత ఇవ్వాల్సిందేనని ఒత్తిడి తేవడంతో కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని, ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు.. వారి వద్దకు వచ్చి సమస్యను అడిగారు. వ్యాపారులు మాట్లాడుతూ.. గతంలో కాంట్రాక్టర్లు బండికి రూ.150, దుకాణానికి రూ.500, ఆటోకు రూ.280, తోపుడుబండికి రూ.150, గంపలకు రూ.50, చిన్న దుకాణానికి రూ.100 సుంకాల రూపంలో వసూలు చేసేవారన్నారు. కొత్త కాంట్రాక్టర్ దుకాణానికి రూ.1500, చిన్న అంగడికి రూ.వెయ్యి, ఆటో రూ.500, తోపుడుబండికి రూ.350, గంపకు రూ.100, చిన్న అంగళ్లకు రూ.150దాకా వసూలు చేస్తున్నాడని వాపోయారు. బస్టాండ్‌కు సంబంధించి మరో కాంట్రాక్టర్ తమ వ్యాపార సముదాయల ఎదుట ఏర్పాటు చేసుకున్న తోపుడుబండ్లకు రోజుకు రూ.150 వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిల్లర అంగళ్లు, వడలు, బారామసాలా తదితర వ్యాపారాల వద్ద రోజుకు రూ.150 ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నట్లు మండిపడ్డారు. వారపుసంత కోసం సోమందేపల్లి, లేపాక్షి, గోరంట్ల, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, తదితర మండలాల నుంచి ప్రతివారం తెల్లవారుజామున 2గంటలకే వస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి తీసుకొస్తారన్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు తాము వ్యాపారాలు నిర్వహించినా అంతంతమాత్రమే సంపాదన ఉంటుందన్నారు. వచ్చే ఆదాయం అంతా కాంట్రాక్టర్ తీసుకుంటే తామేమి తినాలనీ, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని నిలదీశారు. పాత రేట్లకే సుంకాలు వసూలు చేసేలా చూస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చారు. త్వరలో సమావేశం ఏర్పాటుచేసి, ధరలను నిర్ణయించి, ఆ మేరకు పట్టికను ప్రదర్శిస్తామన్నారు. కాంట్రాక్టర్లు పాత ధరల కంటే అదనంగా రూపాయి వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో వారు శాంతించారు. ధర్నాలో వ్యాపారులు బాబయ్య, సునంద, వెంకటప్ప, అశ్వత్థమ్మ, సరోజమ్మ, కిష్టమ్మ, రంగనాథ్, సువర్ణ, వరలక్ష్మి, యశోదమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వేలం పాటను రద్దు చేయాలి

వారపు సంతలో కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా సుంకాలు వసూలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తప్పుబట్టారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సుంకాలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టర్‌తో అధికారులు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. వేలంపాటను రద్దుచేసి, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవిశ్వాసానికే మా ఓటు

- స్పష్టం చేసిన 14 మంది వైసీపీ కౌన్సిలర్లు

కదిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషాపై ఈనెల 23న జరగనున్న అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తామని 14మంది వైసీపీ కౌన్సిలర్లు చెప్పారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చైర్‌పర్సన్‌ను దింపేందుకు గతంలో కొంతమంది అవిశ్వాసం పెట్టాలని క్యాంపు నిర్వహించారన్నారు. ప్రస్తుతం ఆ వర్గామే చైర్‌పర్సన్‌కు అను కూలంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. తమ వార్డుల్లో నాలుగేళ్ల నుంచి అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. అందువల్లే తాము అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయదల్చుకున్నట్లు తెలిపారు. దాదాపు 30మంది కౌన్సిలర్లు తమ వర్గంలో ఉన్నారని తెలిపారు. వైసీపీ అధిష్ఠానం తమను పట్టించుకోలేదని, ప్రస్తుతం అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా మేమూ పట్టించుకోమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కళ్యాణ్, ఇస్మాయిల్, రంగారెడ్డి, షాన్వాజ్, ఖాసీమ్‌తోపాటు వైసీపీ నాయకులు జిలాన్, బండారు మురళి, పిచ్చిలి శంకర్, నౌషాద్, ఇలాహీ, నాసీర్, ఉట్టి ఓం ప్రకాష్, రవి, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

పండుటాకులకు అండ...

6



బండమీదపల్లిలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు

బండమీదపల్లి.. పాడిలో మేటి



పాడి ఆవులు

రోజూ 8 వేల లీటర్లు డెయిరీకి సరఫరా
జిల్లాలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి
ఎక్కువ మందికి జీవనాధారం

ఒకప్పుడు ఆ గ్రామంలో అందరికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడం, దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు నష్టాలే మిగిలేవి. ఈ నేపథ్యంలో రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులను పోషించడం ప్రారంభించారు. కష్టానికి తగిన ఫలితం లభిస్తుండడంతో రైతులు, రైతు కూలీలు పాడినే జీవనాధారం చేసుకున్నారు. రాప్తాడు మండలం బండమీదపల్లి రైతులు పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్నారు.

రాప్తాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు రాప్తాడు మండలంలోని బండమీదపల్లి రైతులు. ఈ గ్రామం అనంతపురం జిల్లా కేంద్రానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో వెయ్యికిపైగా కుటుంబాలు, 4వేలకు పైగా జనాభా ఉంది. గ్రామంలో అందరూ రైతులు, రైతు కూలీలే. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వేరుశనగ, వరి, చీనీ, కంది తదితర పంటలు సాగు చేసేవారు. కాలక్రమేణా వ్యవసాయం భారం కావడంతో రైతులు పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపారు. తమకున్న పొలంలో కొంత భాగం పశుగ్రాసం సాగు చేసుకుని మేతగా ఉపయోగిస్తున్నారు. తర్వాత చాలా మంది పాడి వైపే మొగ్గుచూపారు. హిందూపురం, పుంగనూరు, చింతామణి, కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మేలు జాతి జెర్సీ ఆవులను కొనుగోలు చేసి జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. ఒక్కో కుటుంబానికి రెండు నుంచి 10 పాడి పశువులు ఉన్నాయి. కొంత మంది 15 ఆవులను పోషిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కష్టపడి పని చేస్తూ కష్టానికి తగిన ప్రతి ఫలం పొందుతున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాలు పిండి గ్రామంలోని డెయిరీలకు పోస్తున్నారు. ఏజెంట్లు రైతుల నుంచి సేకరించిన పాలను జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం 1300కు పైగా పాడి పశువులు ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 4 వేల లీటర్లు, సాయంత్రం 4 వేల లీటర్లు మొత్తం 8 వేల లీటర్ల పాలు గ్రామం నుంచి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా బండమీదపల్లి నుంచి పాలు సరఫరా అవుతున్నాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పాల నాణ్యతను బట్టి లీటరు ఆవు పాలకు రూ. 30 నుంచి రూ.36 రైతులకు చెల్లిస్తున్నారు. డెయిరీ ఏజెంట్లు రైతులకు 15 రోజులకు ఒకసారి బిల్లు అందచేస్తారు.



సాగుచేసిన పశుగ్రాసం

పాడి పశువులే జీవనాధారం



మాకు 10 పాడి పశువులు ఉన్నాయి. వరిగడ్డి, వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి పశువులను పోషిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పశువుల వద్దే ఉంటూ జాగ్రత్తగా కాపాడుకుంటున్నాం. గ్రామంలో పశువైద్యశాల ఉండటంతో సకాలంలో వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. ప్రతి రోజూ 80 లీటర్ల పాలు డెయిరీకి సరఫరా చేస్తున్నాం. **-నరసింహులు, రైతు, బండమీదపల్లి**

ప్రభుత్వం చేయూత

ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దాదాపు 10 గోకులం షెడ్లు మంజూరు చేయించారు. 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బండమీదపల్లికి అత్యధికంగా 24 గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 లక్షలు మంజూరు చేస్తోంది. బ్యాంకులు కూడా పాడి పశువులకు రుణాలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.

రోజుకు 140 లీటర్ల పాలు పోస్తున్నాం



మాకు 14 పాడి పశువులు ఉన్నాయి. కుటుంబ సభ్యులందరం కష్టపడి పని చేస్తున్నాం. రెండు ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేశాం. ప్రతి రోజూ ట్రాక్టర్‌లో పశుగ్రాసం కోసుకుని వచ్చి ఆవులకు మేతగా వేస్తాం. ఉదయం 70 లీటర్లు, సాయంత్రం 70 లీటర్లు మొత్తం రోజుకు 140 లీటర్ల పాలు డెయిరీకి పోస్తున్నాం. **-గోవిందు, రైతు, బండమీదపల్లి**

గోకులం షెడ్డు నిర్మించుకున్నాం



వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంకం చేపడుతూ జీవనం సాగిస్తున్నాం. మాకు నాలుగు ఆవులు ఉన్నాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోకులం షెడ్డు మంజూరైంది. షెడ్డు నిర్మించుకుని పశువులు పోషిస్తున్నాం. పాడి పశువులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగకరం. **-కదిరప్ప, రైతు, బండమీదపల్లి**

సకాలంలో వైద్యసేవలు

గ్రామంలో పాడి పశువులు ఎక్కువగా ఉన్నాయి. పశువులకు జ్వరం, పొదుగు వాపు, ఇతర వ్యాధులు సోకితే రైతులు వెంటనే పశువైద్యశాలకు తీసుకువస్తున్నారు. పశువులకు టీకాలు వేసి వ్యాధులు నయం చేస్తున్నాం. గాలికుంటు వ్యాధి టీకాలు, ఎద టీకాలు సకాలంలో వేస్తున్నాం. పాడి పశువులకు బీమా కూడా చేస్తున్నాం.
-సోమేశ్వరి, పశువైద్యాధికారి, బండమీదపల్లి

రైతులకు ప్రభుత్వం చేయూత



రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు సబ్సిడీపై గోకులం షెడ్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందిస్తోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువ ద్వారా ప్రతి ఏటా బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలో రైతులు వ్యవసాయం, పాడి పశువులు పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. **-శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి**

నత్తకు నడకలు నేర్పేలా..

- ఏళ్లుగా సాగుతున్న తాగునీటి పథకం పనులు
- భారీగా పెరిగిన అంచనా వ్యయం
- ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులే..!

అర్ధంతరంగా ఆగిన ట్యాంకు నిర్మాణం



మడకశిర, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు మున్సిపాల్టీల పరిధిలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తప్పేలా లేవని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లుగా ..

ఐదు మున్సిపాల్టీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇందులో మడకశిర పట్టణానికి రూ.63కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా 70 శాతం, ప్రభుత్వం నుంచి 30 శాతం నిధులతో ఈపనులు జరుగుతున్నాయి. పనులు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో మరో రెండేళ్లు పొడిగించారు. అయినా ప్రయోజనం లేదు. మడకశిర సమీపంలోని చెరువులో సంపు, ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటి వరకు 30 శాతం పనులే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మడకశిర చెరువులో సంపు ఏర్పాటుచేసి, అక్కడ నుంచి పక్కనే ఉన్న గుట్టపై వాటర్‌ప్లాంటు నిర్మించి, అక్కడ నీటిని శుద్ధిచేసి మెళవాయి వద్ద నిర్మించిన ట్యాంకుకు పైపుల ద్వారా నీటిని సరఫరా చేసి, అక్కడ నుంచి పట్టణానికి రోజూ నీటిని అందించనున్నారు. పట్టణంలో ఏడు ట్యాంకులను నిర్మిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో 7లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ఎస్సీ కాలనీలో 5లక్షల లీటర్లు, పావగడ రోడ్డు సమీపంలో 6లక్షల లీటర్లు, బేగార్లపల్లి, మారుతీనగర్, గొల్లహట్టి, మల్లినాయకనపల్లిలో ఒక్కొక్కచోట 3లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మిస్తున్నారు.

పెరిగిన వ్యయం

ఉమ్మడి జిల్లాలోని పామిడి, మడకశిర, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, గుత్తి మున్సిపాల్టీల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడానికి కాంప్రహెన్సివ్ వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం ద్వారా రూ. 545 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడిచినా నేటికి 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో నిర్మాణ వ్యయం రూ.545 కోట్ల నుంచి రూ.628 కోట్లకు పెరిగింది. ఈక్రమంలో ప్రస్తుతం ఉన్న ఎస్ఆర్ రేట్ల ప్రకారం అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా రు. ఇప్పటి వరకు అన్ని చోట్ల ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణపు పనులు ప్రారంభం అయ్యి వివిధ దశలలో ఉన్నాయి. సకాలంలో నిధులు విడు దల కాకపోవడం, ప్రారంభంలో కరోనా కారణంగా పనులు నత్తనడకన సాగాయి. దీంతో నిర్మాణ




వ్యయం 15శాతానికి పైగా పెరిగింది. తాగునీటి పథకం పనులు పూర్తి అయ్యేందుకు మడకశిర మున్సిపాల్టీకి రూ.73 కోట్లు, పుట్టపర్తి మున్సిపాల్టీకి రూ.117 కోట్లు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇప్పటిదాకా చేసిన పనుల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం రూ.14కోట్లు చెల్లించింది. ఇంకా మడకశిర, పుట్టపర్తి మున్సిపాల్టీలలో జరిగిన పనులకు సంబంధించి రూ.ఐదు కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మారడంతో అక్కడ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.


ప్రతిపాదనలు పంపాం: ఆదినారాయణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి

రెండు వారాల్లో తాగునీటి పథకానికి సంబంధించిన టెండర్లు పిలుస్తాం. ఇప్పటికి 20 శాతం దాకా పనులు పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పామిడి, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి మున్సి పాల్టీలకు తాగునీటి పథకానికి రూ.545 కోట్లదాకా నిధులు మంజూరయ్యాయి. అందులో రూ.19 కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు 14 కోట్ల దాకా చెల్లించాం. ఇంకా 5 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే ఆ బిల్లులు కూడా చెల్లిస్తాం.

25 శాతం లోపు పనులు జరిగిన వాటిని రద్దు చేస్తూ, చేపట్టవలసిన పనులకు అంచనాలు వేసి రూ.628 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.


GOVERNMENT OF ANDHRA PRADESH
Dept.for the welfare of Differently Abled, Transgenders & Senior Citizens, Ananthapuramu Dist
IDENTITY CARD FOR SENIOR CITIZENS
Regn.No. Date :
Name :
Father / Husband :
Date of Birth & Age :
Aadhar No. :
Assistant Director
Welfare of Differently Abled, TG & SC, Ananthapuramu Dist

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు ముందు భాగం


Address :
Phone / Cell No. :
In Case of Emergency, Contact Name :
Phone / Cell No. :
Blood Group
Occupation
Signature of Card Holder

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు వెనుకభాగం

పండుటాకులకు అండ

- ఎస్‌సీఐడీ కార్డుతో ఎన్నెన్నో ప్రయోజనాలు
- బస్సు, రైలు టిక్కెట్‌పై రాయితీ
- బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అధిక వడ్డీ రేట్లు
- దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలకు అవకాశం
- ప్రభుత్వ పింఛన్ పొందే అవకాశం
- దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే మంజూరు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పండుటాకులకు కొత్త ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి పథకాలు వర్తింపజేసే దిశగా వయోవృద్ధుల గుర్తింపు (ఎస్‌సీఐడీ) కార్డు మంజూరును సులభతరం చేసింది. మాన్యువల్‌గానూ కార్డు అందజేస్తోంది. అంతేకాదు, దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే కార్డు మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. వీటితోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు, సేవలను వినియోగించుకునేందుకు ఎస్‌సీఐడీ కార్డును ప్రవేశపెట్టింది. 60 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఈ కార్డుకు అర్హులు. ఈ కార్డు పొందిన వృద్ధులకు బస్సు, రైలు టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు, దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు, ఎఫ్‌డీ ఖతాలపై అధిక వడ్డీ రేట్లు, ప్రభుత్వ పింఛన్ పొందని వారికి ఈ ఐడీ కార్డు ఆధారంగా అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 6 లక్షలకుపైగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులున్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటికే 5 లక్షలకు



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయం

పైగా వృద్ధులు ప్రభుత్వ పింఛన్ పొందుతున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంకా వేల సంఖ్యలో వృద్ధులు ప్రభుత్వ పింఛన్‌తోపాటు.. కార్డు ద్వారా అందే సేవలకు దూరంగా ఉన్నారనే చెప్పాలి. వీరందరికీ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్డుతో వృద్ధులకు సంక్షేమ పథకాలు, సేవలు మరింత సులభతరంగా అందే అవకాశాలున్నాయి వారు పేర్కొంటున్నారు.

టిక్కెట్ ధరల్లో తగ్గింపు...

ఎస్‌సీఐడీ కార్డుతో ఆర్టీసీ బస్సులు, రైలు ప్రయాణాల్లో టిక్కెట్ ధరల్లో తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు పొందిన వయోవృద్ధులు బస్సులు, రైలులో ప్రయాణించే సమయంలో టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు వర్తిస్తుంది. రాష్ట్రమంతా ఏ జిల్లాకు వెళ్లాలన్నా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆరోగ్య పరిస్థితులు క్షీణించిన వృద్ధులకు సహాయకులుగా ఉన్న వ్యక్తులకు సైతం బస్సు రైలు ప్రయాణాల్లో ఈ ధరలు వర్తింపజేసింది. బ్యాంకుల్లో ఎఫ్‌డీ ఖాతాలు కలిగిన వయోవృద్ధులకు 5 నుంచి 6 శాతం వడ్డీ రేట్ల పెంపునకు అనుమతులిచ్చింది.

దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు

దేవాలయాల్లో పూజలో పాల్గొనాలంటే... సాధారణ ప్రజలకే కష్టంతో కూడుకున్న పని. పండుగ రోజులు, ప్రత్యేక దినాల్లో క్యూలైన్లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. ఇక వృద్ధుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలోనే ఎస్‌సీఐడీ కార్డుతో దేవాలయాల్లో వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించే వెసులుబాటు కల్పించింది. కార్డు కలిగిన వృద్ధులు క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా... వారికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

కార్డు ఆధారంగా పింఛన్...

ఎస్‌సీఐడీ కార్డుతో రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ నేరుగా పొందే అవకాశం కల్పించింది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు ఈ ఐడీ కార్డు ఆధారంగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గతంలో పింఛన్ కోసం సచివాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకునేందుకు వృద్ధులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ ఐడీ కార్డు కలిగిన వృద్ధుల్లో ఎవరికైనా ప్రభుత్వ పింఛన్ అందకపోతే... విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారుల సిఫార్సు లేఖతో పొందే అవకాశం ఉంటుంది.

రెండ్రోజుల్లోపే...

సీనియర్ సిటిజన్ ఐడీ కార్డును వృద్ధులు ఈజీగా పొందవచ్చు. 60 సంవత్సరాలు పైబడినట్లు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌గానీ, పాన్ నంబర్‌గానీ, స్కూల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. ఫొటోలతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి. దరఖాస్తు అందజేసిన రెండ్రోజుల్లోపే సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డును దరఖాస్తుదారులకు అందజేస్తారు.

వృద్ధులు కార్డును ఉపయోగించుకోవాలి



ఉమ్మడి జిల్లాలో 60 ఏళ్లపైబడిన వృద్ధులందరూ సీనియర్ సిటిజన్స్ ఐడీకార్డును పొందాలి. ఈ కార్డు ద్వారా అనేక పథకాలు, సేవలను పొందవచ్చు. ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మందికిపైగా కార్డును పొందారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అర్హత కలిగిన వృద్ధులు కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తే... రెండ్రోజుల్లోపు కార్డు మంజూరు చేస్తాం.
- వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ




రాసిగా పోసిన నిమ్మకాయలు

నిమ్మ ధర పైపైకి..

ఎండల ప్రభావంతో పెరిగిన రేట్లు
దిగుబడి లేకపోవడమూ కారణమే
మే నెలలో మరింత పెరిగే అవకాశం

పుట్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి నిమ్మ రైతులకు బాగా కలిసొస్తోంది. ఎండలు మండిపోతుండడంతో నిమ్మకు డిమాండ్ పెరిగింది. దిగుబడి కూడా లేకపోవడంతో ధరలు పైపైకి చేరుతున్నాయి. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4500 నుంచి రూ.4800 వరకు పలుకుతోంది. మండలంలోని పుట్లూరు, పి.చింతలపల్లి, సూరేపల్లి, నాయకునిపల్లి, బాలాపురం, మడ్డిపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి తదితర గ్రామాల పరిధిలో నిమ్మపంటను 250 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గిపోవడంతోనే ధరలు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి లేదని తెలుస్తోంది.



నిమ్మచెట్లు

మూడు నెలలే కీలకం..

నిమ్మపంట విక్రయించాలంటే ఏడాదిలో మూడునెలలే కీలకమని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడాది పొడవునా పంట దిగుబడి తీసినా ఆశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా, ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.1500కి పెరిగింది. మార్చిలో రూ.2500కి చేరుకుంది. ప్రస్తుతం రూ.4500 నుంచి రూ.4800 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు వంద చెట్లు సాగుచేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తోంది. సాధారణంగా ప్యాకెట్‌కు సైజును బట్టి 800 నుంచి 1,200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండడంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను గోవా, కేరళ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ధర ఆశాజనకంగా ఉంది..



ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఐదెకరాల్లో పంట సాగు చేశా. ఏడాది ప్రారంభంలో ధర అంతంతమాత్రంగానే ఉండేది. నెలరోజుల నుంచి పెరుగుతూ వస్తోంది. తక్కువ ధర ఉన్నపుడు 200 ప్యాకెట్లుపైగానే విక్రయించా. ధర పెరిగినపుడు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ ధర ఇలాగే కొనసాగితే నిమ్మరైతుల కష్టాలు తీరినట్లే.
- రమేష్‌నాయుడు, రైతు, సూరేపల్లి

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మహేష్‌కుమార్ (ఫైల్)

పెద్దవడుగూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొని బెంగళూరుకు చెందిన మహేష్‌కుమార్(46) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్ కుమార్ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుండేవారు. స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాల్లో సిక్కిం రాష్ట్రానికి విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుత్తిఅనంతపురం సమీపాన గల పెట్రోల్ బంక్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి, మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

గోరంట్ల/ఉరవకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. గోరంట్ల ఒకటో వార్డుకు చెందిన అనితాబాయి (49) విషం తాగి గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త విజయ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వారి ఒక్కగానొక్క కుమార్తె కర్ణాటకలో ఆయుర్వేద వైద్యురాలి కోర్సు చదువుతున్నారు. ఉదయం విజయ్‌కుమార్ పాఠశాలకు వెళ్లాక అనితాబాయి ఇంట్లోనే విషం తాగింది. అస్వస్థతకు లోనైన ఆమెను బంధువులు గోరంట్ల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. దీనిపై సీఐ శేఖర్‌ను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

● ఉరవకొండ పట్టణంలోని కొలిమి లే అవుట్‌లో జయలక్ష్మి(47) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ధనుంజయతో కలిసి జయలక్ష్మి కొలిమి లేఅవుట్‌లో నివాసముంటున్నారు. రెండేళ్ల కిందట జయలక్ష్మి చిన్న కుమారుడు మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసికంగా కుంగిపోయారు. దీనికి కుటుంబ సమస్యలు తోడవడంతో తీవ్రంగా మనస్తాపం చెందారు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ మహానంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు గల వివరాలను ఆరాతీశారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఫొటోగ్రాఫర్ దుర్మరణం



అశ్వత్థనారాయణ (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపల్లి క్రాస్ సమీపాన గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్న ఫొటోగ్రాఫర్ అశ్వత్థనారాయణ (46)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో ఆయన దుర్మరణం చెందాడు. హిందూపురం అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతేబిదనూరుకు చెందిన అశ్వత్థనారాయణ చౌళూరులో ఎప్పటిలాగే వాకింగ్ చేస్తున్నాడు. దేవరపల్లి క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య సుజాత అక్కడకు చేరుకుని బోరున విలపించింది. పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అశ్వత్థనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతిపట్ల హిందూపురం ఫొటోగ్రాఫర్లు సంతాపం తెలిపారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

అనంతపురం క్రైం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం అడిషనల్ ఏడో సెషన్స్ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన బత్తిని సుమకుమారిని 17ఏళ్ల కిందట అనంతపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయం తెలుసుకున్న భర్త ఆమెను మందలించాడు. దీంతో ఆమె భర్తను అడ్డు తొలగించాలనుకుంది. 2021 నవంబరు రెండో తేదీ రాత్రి 7 గంటల సమయంలో వారింట్లోనే భర్తను రోకలిబండతో కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అదే రోజు అప్పటి వన్‌టౌన్ సీఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఏడో సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి హరిత 15మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో గురువారం ముద్దాయి బత్తిని సుమకుమారికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసును పీపీ నాగరాజ బాబు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ముగ్గురు కర్ణాటకవాసులకు గాయాలు



లారీని ఢీకొన్న కారు

పెనుకొండరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరిగింది. శిడ్లఘట్టకు చెందిన సిల్క్ వ్యాపారులు మహేష్, మధు, శ్రీనివాసులు కారులో ధర్మవరానికి వచ్చి స్వస్థలానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను 108లో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆర్బిటార్ పరీక్షలో హుస్సేన్‌ఖాన్ ఉత్తీర్ణత



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెస్ సంస్థ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆర్బిటార్(అంపైర్) పరీక్షలో జిల్లాకు చెందిన చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్ ఉత్తీర్ణత సాధించాడు. ఇటీవల జరిగిన 12వ ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఆన్‌లైన్ సెమినార్‌లో 23దేశాల నుంచి పాల్గొన్నారు. వారిలో మనదేశం నుంచి ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అందులో హుస్సేన్‌ఖాన్ ఉండటం గమనార్హం. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే చెస్ పోటీలకు హుస్సేన్‌ఖాన్ ఆర్బిటార్‌గా వ్యవహరించే అవకాశం లభించింది.

రాష్ట్రంలో ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం

(5వ పేజీ తరువాయి)

ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 29 డిపోలు ఉన్నాయని, అనంతపురంలో 30వ గోడౌన్‌ను అత్యంత ఆధునికంగా నిర్మించామని తెలిపారు. గోదాము నుంచి వెళ్లే ప్రతి స్టాక్ వాహనాన్ని ట్రాక్ చేస్తున్నామని, పర్యవేక్షణ వ్యవస్థను తెచ్చామని అన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అరికట్టామని, తద్వారా రాష్ట్రంలో 30 నుంచి 40 శాతం అమ్మకాలు పెరిగాయని తెలిపారు. నవోదయం ద్వారా నాటుసారా, అక్రమమద్యం రవాణా లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా మద్యం డిపోను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ డిపో 94 మద్యం షాపులు, బార్లకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, అందుకే చంద్రాబాబు కియ పరిశ్రమ, పలు అనుబంధ పరిశ్రమలు, నాసిన్, బెల్ వంటి సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేయించారని తెలిపారు. జిల్లాలో హార్టికల్చర్ అభివృద్ధిలో నడుస్తోందని అన్నారు.

రెవెన్యూ పెరిగింది..

కొత్త మద్యం పాలసీ ద్వారా ఆదాయం పెరిగిందని ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ అన్నారు. అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. 2016లో ఇక్కడ ఉన్న పాత సారా బాట్లింగ్ ప్లాంట్ కాలిపోయి రూ.9 కోట్ల దాకా నష్టం జరిగిందని, దానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయిందని తెలిపారు. అప్పట్లోనూ మంత్రిగా కొల్లు రవీంద్ర ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చి కాలిపోయిన ప్లాంట్ పరిశీలించానని తెలిపారు. దాని స్థానంలో ప్రస్తుతం అధునాతన గోడౌన్‌ను నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం కొంత భూ సమస్య ఉందని, త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. సుమారు 27 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోడౌన్‌ను నిర్మించామని ఏపీఎస్‌బీసీ లిమిటెడ్ ఎండీ నిశాంత్ కుమార్ తెలిపారు. హమాలీలు పనిచేసేందుకు గోడౌన్ సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు.

ఇంకో రూ.5 కోట్లు ఇవ్వండి: పరిటాల సునీత

2016లో ఈ గోడౌన్ కాలిపోయిందని, అప్పట్లోనూ మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్రను నూతన గోడౌన్ నిర్మించాలని కోరామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అందుకు రూ.11 కోట్లు అప్పట్లోనే మంజూరు చేశారని తెలిపారు. వారి చేతుల మీదుగానే ఈ గోడౌన్‌ను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కోర్టులో ఉన్న భూ సమస్యను అధికారులు, తాము కలసి పరిష్కరిస్తామని అన్నారు. మరో రూ.5 కోట్లు నిధులు మంజూరు చేస్తే పూర్తిస్థాయి గోడౌన్ తయారవుతుందని అన్నారు. అనంతరం హమాలీలకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. గోడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొళ్లకుంట అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



లిక్కర్ గోదాములో పనిచేస్తున్న హమాలీలతో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి శ్రీ

సమస్యలు పరిష్కరించండి

మంత్రికి ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం నేతల వినతి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల సంక్షేమ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లాకు వచ్చిన మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు హెడ్ కానిస్టేబుల్ క్యాడర్ వారికి మాత్రమే ఉద్యోగోన్నతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందేందుకు 25 ఏళ్లు పడుతోందన్నారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందేలోగా అనేకమంది రిటైరవుతున్నారన్నారు. రెగ్యులర్, అడ్‌హాక్ ఉద్యోగోన్నతుల్లో హెడ్ కానిస్టేబుళ్లకు అన్ని జోన్లలో 40 శాతం ప్రాతినిధ్యం కల్పించి, న్యాయం చేయాలని కోరారు. సరండర్ లీవ్ శాలరీలను వర్తింపజేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి సునీత, నాయకులు రమేష్‌రెడ్డి, బాబ్జీ శామ్యూల్, కల్యాణి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంక్షేమ సంఘం నేతలు

కానిస్టేబుల్ భార్య మెడలో గొలుసు చోరీ

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్

వరుసగా మూడు ఘటనలు

అనంతపురం క్రైం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఈసారి ఓ దొంగ.. ఏకంగా పోలీసు కానిస్టేబుల్ భార్య మెడలోని బంగారు గొలుసునే తస్కరించాడు. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ భార్య దేవి బుధవారం మధ్యాహ్న సమయంలో రాప్తాడుకు స్కూటీలో బయలుదేరింది. నగర శివారులోని హార్మోన్ సిటీ సమీపంలో ఓ దొంగ అటకాయించి, ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు తస్కరించాడు. దీనిపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7వ తేదీన తపోవనం సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రావణి.. తల్లితో కలిసి స్కూటీలో వెళ్తుండగా దొంగ బైక్‌లో వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నాడు. వారం రోజుల క్రితం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆమె అడ్డుకోవడంతో అతడి చేతిలోకి ఒకటిన్నర తులం బంగారు వెళ్లింది. వరుసగా మూడు చైన్‌స్నాచింగ్‌లు జరగడంతో ఎస్పీ జగదీష్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిఘా ఉంచారు. ఈ క్రమంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ దొంగను పట్టుకున్నట్లు సమాచారం. ఈ మూడు చైన్ స్నాచింగ్‌లు అతడే చేసినట్లు విచారణలో చెప్పినట్లు తెలిసింది.

కొడికొండ చెక్‌పోస్టులో..

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో చిల్లర దుకాణం నడుపుకుంటున్న ఓ మహిళ మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసుని గుర్తు తెలియని ఆగంతకులు గురువారం లాక్కెళ్లారు. బాధితురాలు ఇంద్రమ్మ తెలిపిన మేరకు.. తను చిల్లర కొట్టులో ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కూల్ డ్రింక్ అడిగారన్నారు. వారికి కూల్ డ్రింక్ అందించేందుకు పక్కకు వంగడంతో ఒక వ్యక్తి వచ్చి బలవంతంగా మెడలో ఉన్న బంగారు మాంగళ్యం గొలుసును లాగాడన్నారు. ప్రతిఘటించినా గట్టిగా లాగడంతో గొలుసు తెగిపోయిందన్నారు. ఈక్రమంలో తన మెడపై గాయమైందని తెలిపారు. వెంటనే బయటికి వచ్చి కేకలు వేయగా దుండగులు ద్విచక్రవాహనంలో పారిపోయారన్నారు. దుండగులు మొహానికి కర్చీఫ్ కట్టుకొని వచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధితురాలితో వివరాలు ఆరాతీశారు. దగ్గర్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాదిలో రెండోసారి

బాధితురాలు ఇంద్రమ్మ పైసాపైసా కూడబెట్టి తెచ్చుకున్న బంగారం ఒకే ఏడాదిలో రెండుసార్లు దొంగల పాలైంది. చిల్లర కొట్టు నిర్వహణతోనే జీవనం సాగిస్తూ పొదుపు చేసుకుని కొనుక్కున్న బంగారాన్ని దుండగులు దోచేశారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. గతేడాది ఇదే కొట్టులో ఉండగా ఒక వ్యక్తి వచ్చి వాటర్ బాటిల్ అడిగాడు. అంతలోనే చాకచక్యంగా మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఏదో శుభకార్యానికి వెళ్లి వచ్చి మెడలో బంగారు గొలుసులని అలాగే ఉంచుకుంది. దాంతో 8 తులాలు బంగారు గొలుసులు లాక్కెళ్లారు. రెండు నెలల తర్వాత చోరీ చేసిన దుండగుడు బాగేపల్లి పోలీసులకు చిక్కాడు. వారి విచారణలో కొడికొండ చెక్‌పోస్టులో బంగారు గొలుసు దొంగిలించినట్లు ఒప్పుకుని సొత్తుని పోలీసులకు అప్పగించాడు. ఆ సొత్తు ఇప్పటికీ ఆమెకు ఇవ్వలేదు. కర్ణాటక పోలీసుల వద్దే ఉంది.

తల్లీబిడ్డను కాపాడుకుందాం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం



మాట్లాడుతున్న డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిద్దాం, లోపాలను సరి చేసుకుని సమష్టిగా పనిచేసి తల్లీబిడ్డను కాపాడుకుందామని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొ న్నారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో గురువారం మాతాశిశుమరణాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులలో సంభవించిన మాతాశిశుమరణాలపై చర్చించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతినెల 9వ తేదీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గర్భవతులకు గ్రూపు సమావేశం నిర్వహించి, వారికి ఆరోగ్యవిద్య అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, కాన్పు అయ్యేంత వరకు వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు. ఏ బిడ్డా జన్మిస్తూ మరణించకూడదు. ఏతల్లి జన్మనిస్తూ మరణించకూడదని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కార్య క్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ నాగేంద్రనాయక్, డాక్టర్ సునీల్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్లు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ నీరజ, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కార్తీక్, ఐసీడీఎస్ పీడీ శారద, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులు సూపర్‌వైజర్లు ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోకూడదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. గురువారం స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ గర్ల్స్ హాస్టల్, ఎస్సీ, బీసీ వసతిగృహాలను న్యాయాధికారి సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. చదువు, పరీక్షల వంటి సమస్యల నేపథ్యంలో పోటీతత్వాన్ని ఎదుర్కోవాలన్నారు. చదువుపై ఆందోళన చెంది, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదన్నారు. మానసిక ఒత్తిడికి లోనై తెలిసీతెలియని వయసులో ఆత్మహత్యలవైపు పయనించడం సరికాదన్నారు. విద్యార్థులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తల్లిదండ్రులు జీవితాంతం తీరని మనోవేదనకు లోనవుతారన్నారు. తల్లిదండ్రుల గురించి ఆలోచించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,150, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1363 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. కూడేరు, పుట్లూరు, కణేకల్లు మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. గార్లదిన్నె, బెలుగుప్ప, తాడిపత్రి, డి. హిరేహాళ్, రాయదుర్గం తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వైసీపీ అరాచకాల లెక్క తీయాల్సిందే..!

ఎమ్మెల్సీకి ఎస్కేయూ వర్గాల ఫిర్యాదు



ఎమ్మెల్సీకి అరాచకాలను వివరిస్తున్న ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎస్కేయూ ఉద్యోగులు, విద్యార్థులపై సాగించిన అరాచకాల లెక్క తీయాల్సిందేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని వర్సిటీ వర్గాలు కోరాయి. గురువారం ఎస్కేయూకి వచ్చిన ఎమ్మెల్సీ.. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిశారు. పలువురు ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు.. ఎమ్మెల్సీని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. బోధనేతర ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులపై కక్షగట్టిన మాజీ వీసీ రామకృష్ణారెడ్డి అనేకమందిని అకారణంగా సస్పెండ్ చేశారన్నారు. వారిని ఆర్థికంగా, మానసికంగా కుంగదీయడమే కాకుండా ఒక ఉద్యోగిని బలి తీసుకున్నారన్నారు. రివర్స్ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు కటింగ్, బదిలీలతో వేధించారన్నారు. రెండు దశాబ్దాలుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 25 మంది మరణిస్తే బాధిత కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించలేదని వాపోయారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ.. 203 జీఓను అతిక్రమించి రెగ్యులరైజేషన్, ప్రమోషన్లు కల్పించారన్నారు. అభివృద్ధి పేరుతో వర్సిటీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దాదాపు 4వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. వాటన్నింటిపై విచారణ చేపట్టేందుకు కమిటీని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధితులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం ఆయనను అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప, నేతలు నాగముణి, మారుతి, లక్ష్మీనరసింహులు, గోవిందరాజులు, ఇలియాజ్, ఉమాపతి ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి సామాజిక చైతన్య యాత్ర

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



వివరాలు వెల్లడిస్తున్న సావిత్రి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ శుక్రవారం నుంచి ఈనెల 14వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సామాజిక చైతన్యయాత్ర చేపట్టనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జడ్పీ హాల్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 14న సాయంత్రం 5 గంటలకు అంబేడ్కర్ నగర్ నాగులకట్ట హైస్కూల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, వెంకటేష్, జీవ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, గిరి, గర్ల్స్ కమిటీ కన్వీనర్ రజిత, ఐద్వా జిల్లా నేతలు చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

అనంతపురం విద్య/కొత్తచెరువు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష తేదీ మార్పు చేసినట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న నిర్వహించాల్సిన పరీక్షను ఈస్టర్ పర్వదినం కారణంగా 21వ తేదీకి మార్చినట్లు తెలిపారు. మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు ఈ విషయాన్ని విద్యార్థులకు చేరవేయాలన్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను www.cse.ap.gov.in, www.ap ms.apcfss.in వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పోలీసు పిల్లలకు గుణాత్మక విద్యే లక్ష్యం: ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యమని ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం పోలీసు రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూల్ మూడో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై, మాట్లాడారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ నిర్వహిస్తున్నారన్నారు. చదువులతోపాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. పిల్లలకు పెన్సిళ్లు, క్రెయాన్స్‌తోపాటు ప్రతి పోలీసు స్టేషన్‌లో 15 హెల్మెట్ల ఏర్పాటుకు డిస్కవరీ సంస్థ నిర్వాహకుడు అనిల్‌కుమార్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డీవీ రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఏఆర్), డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, నీలకంఠేశ్వర్‌రెడ్డి (ఏఆర్), సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, దేవానంద్, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, రాముడు, పోలీస్ అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, హరినాథ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

న్యూస్ బాక్స్

క్షయ నిర్ధారణ పరీక్షలు

నల్లమాడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామాంజులు, ఏఎన్ఎంలు యశోద, శ్యామల, ఈశ్వరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్ పాల్గొన్నారు.

నూతన భవనంలోకి గ్రామీణ బ్యాంక్

నంబులపూలకుంట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం సమీపంలో నూతన భవనంలోకి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను గురువారం మార్చారు. దీన్ని జనరల్ మేనేజర్ సంజీవప్ప రంగప్ప బేగర్, రీజనల్ మేనేజర్ రమేష్ ప్రారంభించారు. ఇందులో మేనేజర్ పిచ్చయ్య, అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, బ్యాంక్ సిబ్బంది, సీఓలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని జామీయా మసీదు కమిటీ కార్యదర్శి హైదర్ కోరారు. జామీయ మసీదులో గురువారం ముస్లిం మతపెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతామన్నారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు భూమిపూజ

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామంలో రివర్స్ ఆస్మోసిస్ (ఆర్వో) ప్లాంటును ఏర్పాటుకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ... ఈ ప్లాంటు ఏర్పాటుతో గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఇందులో నాయకులు రాజు, జయరాం, సూరి, బిల్లే శీన పాల్గొన్నారు.

షామీల్‌కు ఘన నివాళి

కదిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హోమియో పితామహుడు షామీల్ జయంతి సందర్భంగా తలుపుల ప్రభుత్వ వైద్యశాలలో ఆయన చిత్రపటానికి గురువారం పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు అఫ్తాబ్, ఆశ్రిత, ఆసుపత్రి సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

14న అంబేడ్కర్ జయంతి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను స్థానిక గణేష్ కూడలిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సోమవారం నిర్వహిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత సంచాలకుడు శివరంగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మండల స్థాయిల్లోనూ అన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

వీధుల్లో పేరుకుపోయిన చెత్త



లక్ష్మీచెన్నకేశవపురంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు లక్ష్మీచెన్నకేశవపురంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. రోడ్డు పక్కన చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వీఐపీలు, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు అటువైపు చూస్తూనే వెళ్తుంటారే తప్ప.. సమస్యను పరిష్కరించడం లేదని మండిపడుతున్నారు. చెత్తను తరలించే ట్రాక్టర్లు పదిరోజులుకు ఒకసారి వస్తున్నాయని, ఆలోపు చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోందని అంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో కొన్ని ప్రధాన వార్డుల్లో మాత్రమే పర్యటిస్తూ శుభ్రం చేయిస్తూ ఫొటోలకు ఫోజులు ఇస్తూ వాట్సా‌ప్‌లో అప్‌లోడ్ చేస్తుంటారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలపై వారు అసలు దృష్టి సారించడం లేదన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులు ప్రదానం

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైనట్లు ధ్రువపరిచే పత్రాలను ధర్మవరం కళాకారులు గురువారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు 2023లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో ధర్మవరం నాట్యకళాకారుల పేర్లు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధర్మవరం లలిత నాట్యకళానికేతన్ గురువులు బాబుబాలాజీతో పాటు అతడి 12 మంది శిష్యులకు వచ్చిన రికార్డ్‌లను కూచిపూడి గురువులు శేషుబాబు చేతులమీదుగా గురువారం అందజేశారు. సినీ, సీరియల్ నటి జ్యోతిరెడ్డి చేతులమీదుగా కూడా రామలాలిత్య గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను అందుకున్నారు.



గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పత్రాలను అందుకుంటున్న కళాకారులు

ప్రధాన రహదారిపై కుంగిన కల్వర్టు

గాండ్లపెంట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో రెక్కమాను వద్ద కాల్వర్టు కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. ఈ కారణంగా ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. దీంతో సమీప గ్రామస్థులు వాహనదారులకు ఆ గుంత చుట్టూ చిన్నపాటి రాళ్లను ఏర్పా టు చేశారు. అయినా రాత్రి సమయంలో నూతన వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాలు ఓవర్‌టేక్ సమయంలో ఈ గుంత వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేసి, గుంతను పూడ్చి వేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.



రెక్కమాను రహదారిపై కుంగిన కల్వర్టు

నిరుపయోగంగా నీటి ట్యాంకులు

● తనకల్లు మండలంలో ఐదేళ్లుగా వృథాగానే.. ● కొత్తచెరువులో నిర్మించారు.. వదిలేశారు..!



తనకల్లు : నక్కరాళ్ల తండాలో గుట్టలో నిర్మించిన నీటి ట్యాంకు



కొత్తచెరువు : నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకులు

తనకల్లు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, నక్కరాళ్ల తండా గ్రామాల వద్ద నిర్మించిన తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సత్యసాయి నీటి పథకంలో భాగంగా వీటిని నిర్మించారు. ఫ్లోరైడ్ రహిత తాగునీటిని ప్రజలకు అందించడంతో కోసం రూ.కోట్లు ఖర్చు చేసి ఓవర్ హెడ్ ట్యాంకులను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ఒక్కో ట్యాక్ నిర్మాణానికి అప్పట్లోనే రూ.25 లక్షలు ఖర్చు చేశారు. 15 సంవత్సరాలు వరకు నీటిని బాగానే సరఫరా చేశారు. ఐదేళ్ల నుంచి నీటిని సరఫరా చేయకపోవడంతో.. ఆ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. ఆయాగ్రామాల వాసులు నాటి వైసీపీ పాలకులు, అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ స్పందించలేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కవితను వివరణ కోరగా.. పార్నపల్లి నుంచి కదిరి మున్సిపాల్టీ పరిధిలోని కుటగుల్లా వరకే సత్యసాయి నీళ్లు వస్తున్నాయని, తనకల్లు మండలానికి నీళ్లు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. తగినన్ని నీళ్లు వస్తే అప్పుడు ఈ ట్యాంక్‌లకు నీరు అందించగలమని స్పష్టం చేశారు.

● కొత్తచెరువు: స్థానిక విజయనగర కాలనీలో తాగునీటి సమస్య ఉంది. దీంతో ప్రభుత్వం రూ.1.10 లక్షలతో ఆ కాలనీలో ట్యాంకులను నిర్మించింది. వీటి నిర్మాణం కూడా పూర్తయి మూడు నెలలు అవుతోంది. ఇంతవరకూ ఆ ట్యాంక్ ద్వారా అధికారులు నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో నేటికీ ఆ కాలనీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాలకులు, అధికారులు స్పందించి ఈ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీఓ నటరాజ్‌ను వివరణ కోరగా.. విజయనగర్ కాలనీలోని ట్యాంక్‌లకు నీరు సరఫరా కావడం లేదని, త్వరలో పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పుట్టపర్తి : నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు జిల్లావ్యాప్తంగా ఆయా డిపోల వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. అందులో భాగంగా పుట్టపర్తి ఆర్టీసీ డిపో ఎదుట డిపో అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం గత నెలలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ 38 డిమాండ్లలో వినతిపత్రం ఇచ్చినా, ఇప్పటివరకు స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు శంకర్, శ్రీరామ్‌నాయక్, తిరుపతమ్మ, రవితేజ, అప్పిరెడ్డి, ఈశ్వరయ్య, గంగులయ్య, నూర్ మహమ్మద్, శివారెడ్డి పాల్గొన్నారు.

● ధర్మవరం: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఉద్యోగుల భద్రత కోసం 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జోనల్ నాయకులు ఏవీ నరావు, రీజనల్ నాయకులు జీవై నాగప్ప, దుర్గాప్రసాద్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, హరి, డిపో నాయకులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ ఉద్యోగులు స్థానిక డిపో వద్ద గురువారం ధర్నా చేశారు. గతంలో ఉద్యోగుల భద్రత కోసం వచ్చిన జీవోను యదావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ నాయకులు ఎన్‌వీ రమణ, రామచంద్ర, గంగన్న, వహీదాబేగం, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, జీవ్లానాయక్ పాల్గొన్నారు.

భూసార పరీక్షపై శిక్షణ



కిట్లను అధికారులకు అందజేస్తున్న ఉద్యాన శాఖాధికారి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలపై స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో డిజిటల్ గ్రీన్ పర్యవేక్షణాధికారి శ్రీకాంత్ ప్రవశిక గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కేవలం 15 నిమిషాల్లో రైతులకు భూసార పరీక్ష నిర్వహించి.. రైతులకు వివరాలు ఎలా అందచేయాలో వివరించారు. అనంతరం భూసార పరీక్ష కిట్లను రైతుసేవ కేంద్రాల అధికారులకు ఉద్యానవనశాఖాధికారి నవీన్‌కుమార్ అందచేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల రైతుసేవాకేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా జనజాగృతి

తనకల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి గ్రామంలోని రైతులకు జనజాగృతి సంస్థ అండగా నిలిచింది. ఈ గ్రామంలోని పలు బోర్లు ఎండిపోయాయి. దీంతో ఆయా బోర్ల కింద సాగు చేస్తున్న వేరుశనగ, మిరప, శనగ తదితర పంటలు ఎండు ముఖం పట్టాయి. ఆ సమయంలో జనజాగృతి సంస్థ రైతులకు స్ప్రింక్లర్లను మంజూరు చేసింది. రైతులకు నీటి సాయంపై అవగాహన కల్పించింది. దీంతో పక్కనున్న రైతుల బోర్ల నుంచి నీటిని స్ప్రింక్లర్ల ద్వారా సరఫరా చేసేలా ఒప్పించి.. ఆ పంటలను కాపాడింది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా నీటిని పంచుకునే రైతులకు ఉచితంగా స్ప్రింక్లర్ల సెట్లు, నీటి పైపులను మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



కదిరి : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు ఏకంగా రూ.50 పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎల్ నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్, ముస్తాక్, రామమోహన్, రమణమ్మ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● తాడిమర్రి : గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై సీఐటీయూ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు, ట్రైనర్లు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్ స్కిల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఉన్నతి ఆర్గనైజేషన్ యునెస్కు, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ఇందులో సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ బాలాజీనాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌స్కిల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాస్, ఏఓ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ శివతేజ బాధ్యతల స్వీకరణ

ముదిగుబ్బ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ విద్యుత్ శాఖా ఏఈగా శివతేజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈ నాగభూషణ్ నాయక్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో తలుపుల ఏఈగా ఉన్న శివతేజ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

● విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకుడు కోట్ల మనోజ్ బాబీ విద్యుత్ ఏఈ శివతేజను కోరారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సమస్య అధికంగా ఉందని, రైతులు పెట్టిన పంటలు వాడు ముఖం పడుతున్నాయని, లైన్‌మన్లు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ మూడు నెలలు రైతులకు విద్యుత్ సమస్య లో వోల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి అన్నారు. గురువారం కదిరిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణయాదవ్, మిట్టా వంశీకృష్ణయాదవ్, కుటాగుళ్ల వెంకటేష్, రొద్దం ఉత్తమరెడ్డి, గంగాధర్, పీటీ ఆంజనేయులు, సుదర్శన్, రామక్రిష్ణ, కేశవరెడ్డి, ఇంతియాజ్, చంటి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మంత్రి కొల్లు రవీంద్రకు ఘనస్వాగతం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు విచ్చేసిన గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లురవీంద్రకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనంతపురంలోని వారి నివాసంలో గురువారం ఘనస్వాగతం పలికారు. అలాగే మంత్రికి పెనుకొండ నియోజకవర్గం పాలసముద్రంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందచేశారు.

● మంత్రి దృష్టికి పలు సమస్యలు

ముదిగుబ్బ : మండలంలోని పలు సమస్యలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించాలని కోరినట్లు టీడీపీ హిందూపురం కో-ఆర్డినేటర్ హేమలతా భాయ్ తెలిపారు. ఈ మేరకు గురువారం అనంతపురంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు.

● వడ్డెర్లకు క్వారీలు కేటాయించాలి

ఓబుళదేవరచెరువు: వడ్డెర్లు కులవృతిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, కావున వడ్డెర్లకు క్వారీలు కేటాయించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్రను కోరినట్లు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి జెరిపిటి ఆంజనప్ప తెలిపారు. గురువారం అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో మంత్రికి విన్నవించినట్లు చెప్పారు.





మంత్రితో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ

క్రైం న్యూస్..

డ్రిప్ పైపుల దొంగ అరెస్ట్

బత్తలపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురానికి చెందిన సూర్యనారాయణ తోటలో డ్రిప్ పైపులు చోరీకి గురయ్యాయి. బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సోమశేఖర్ చుట్టుపక్కల గ్రామాల్లో గురువారం విచారించగా మండలంలోని చిన్నకోట్లాలకు చెందిన నాగరాజు మోటర్ బైకుపై డ్రిప్ పైపులను వేసుకొని.. ధర్మవరంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు తెలుసుకున్నాడు. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో వెల్దుమడుగు క్రాస్ వద్ద నాగరాజును అరెస్ట్ చేసి.. అతని వద్ద ఉన్న డ్రిప్ పైపులను స్వాధీనం చేసుకున్నాడు. నిందితుడ్ని ధర్మవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేత..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుతండాలో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

భర్తపై కేసు నమోదు

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య నగర్‌కు చెందిన కదిరి రూప తన భర్త సురేశ్‌పై పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. సురేశ్ అనుమానంతో నిత్యం తనను వేధిస్తున్నాడని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది. దీంతో సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలి

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌పై టీడీపీ నాయకులను రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్న వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్పకు వినతిపత్రాలు అందజేశారు. ఇందులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ఐటీడీపీ, సోషల్ టీం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



బుక్కపట్నం, తాడిమర్రిలో గరుడ వాహనంపై శ్రీవారు

గరుడ వాహనంపై శ్రీవారు

బుక్కపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అతి పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గరుడ వాహన సేవను కన్నులపండుగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీనారాయణస్వామి మూలవిరాట్‌కు విశేషపూజలు, అభిషేకాలు, ప్రత్యేకాలంకరణ చేశారు. సాయంత్రం ప్రధాన అచర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో గరుడ వాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమించారు. నేడు స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● తాడిమర్రి: శ్రీలక్ష్మీతారమ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని గురువారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువు తీర్చి పూజలు నిర్వహించి.. గ్రామమంతా ఊరేగించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



బుక్కపట్నం: గర్భవతులకు సూచనలు ఇస్తున్న పీడీ శ్రీదేవి

బుక్కపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది, బాలింతలు చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు 3,7లో నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భవతి నుంచి బిడ్డపుట్టి రెండు సంవత్సరాలు పూర్తి అయ్యేంత వరకు బిడ్డ పెరుగుల వేగంగా ఉంటుందని, ఈ 1000 రోజులు పిల్లలకు మంచి పౌష్టికాహారం, సంరక్షణ అందించాలని అన్నారు. అలాగే చిన్నారులకు తినిపించే జింక్ ఫుడ్ ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కౌసల్యసాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, జ్యోతి, గోవిందమ్మ, ఆయాలు, గర్భవతులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: ఆరోగ్య సంరక్షణపై గర్భవతులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత గురువారం అమీన్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. గర్భవతులు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగ్‌వాడీ కార్యకర్తలు ఆదెమ్మ, భాగ్యమ్మ, ఆంజలి, ఆయాలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, మండల సమాఖ్య అధ్యక్షురాళ్లకు ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఆదర్శ రూరల్ డైవలప్‌మెంట్ ట్రైనింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంక్ ఖాతాల నిర్వాహణ, బ్యాంక్ సేవలు, ఫిక్సడ్ డిపాజిట్లు, కరెంటు ఖాతాల నిర్వాహణ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఆదర్శరూరల్ డైవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి శివానంద్, రీసోర్సు పర్సన్లు రాజప్ప, గంగరాజు, శంకర్, సామాజిక కార్యకర్త పార్వతమ్మ, మహిళలు, మహిళ సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.

నల్లచెరువు వారపు సంత వేలం

కదిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు గ్రామపంచాయతీ వారపు సంతను గురువారం వేలం నిర్వహించినట్లు సర్పంచ్ పంచరత్నమ్మ తెలిపారు. వేలంలో వీఎం బాషా రూ.55,300లకు పాటపాడి సంతను దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వేలం పాటదారులు పాల్గొన్నారు.

● చెత్త సంపద కేంద్రాల పరిశీలన

నల్లచెరువు మండలంలోని అల్లుగుండులో చెత్త సంపద కేంద్రాన్ని డీపీఓ సమత పరిశీలించారు. చెత్త సంపద తయారీపై ఆరా తీశారు. ఆమె వెంట డీఎస్‌పీఓ ఆంజనప్ప, ఈఓఆర్డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి విజయ్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్: యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

మడకశిరటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి ఏపీఆర్జేసీ పాలిటెక్నిక్, ఎంజేపీ, ఆర్‌డీటీ సెట్‌లకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లాకార్యదర్శి డి.నరసింహమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం కేపీ పాఠశాలలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సమావేశమయ్యారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్‌పై చర్చించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, హాల్‌టికెట్ జిరాక్స్ కాపీలను సమర్పించి కోచింగ్ సెంటర్‌లో చేరవచ్చన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు మాలింగప్ప, జోగప్ప, కదురన్న, మూడ్లగిరియప్ప, దేవరాజు ఉన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

గుడిబండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబులబండ పంచాయతీ పరిధిలోని బూదిపల్లి తండా గ్రామానికి చెందిన మహిళలు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రధాన రోడ్డులో ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధితశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై ముళ్లకంపలు వేసి ఖాళీ బిందెలతో మహిళలు నిరసన చేపట్టడంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బూదిపల్లికి చెందిన టీడీపీ నాయకులు జయరామప్ప, మాజీ సర్పంచి శ్రీనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి నిరసన తెలుపుతున్న మహిళల వద్దకు వెళ్లి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ధర్నాను విరమింపజేశారు.

రాజకీయాలపై ఆసక్తి లేదు

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప

పెనుకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు, పదవులపట్ల తనకు ఎలాంటి ఆసక్తి లేదని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 22ఏళ్లుగా ట్రస్ట్‌లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్య, వైద్యం కాకుండా ఎటువంటి అవసరాలకైనా ముందుండి తమవంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందిస్తున్నామని, సేవా కార్యక్రమాల్లోనే సంతృప్తి పొందుతున్నానని, దేవుడి ఆశీస్సులతో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానన్నారు.

లైన్‌మన్‌పై దాడి

లేపాక్షి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు కట్టకపోవడంతో కనెక్షన్ తొలగించిన లైన్‌మెన్‌పై దాడిచేసిన సంఘటన గురువారం తిలక్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు తిలక్‌నగర్‌లో నివాసముంటున్న హసీనా కుమారుడు ఆసిఫ్ విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీంతో రెండు రోజుల క్రితం లైన్‌మెన్ శివారెడ్డి ఇంటికి ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగించారు. రాత్రి సమయంలో ఇంటికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. తెలుసుకున్న లైన్‌మెన్ గురువారం ఇంటివద్దకు వెళ్లగా తల్లి, కుమారుడు ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసి దాడిచేశారు. లైన్‌మెన్ శివారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు.

నైపుణ్యాభివృద్ధికి ఒకేషనల్ కోర్సులు

అగళి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఏపీ మోడల్ స్కూల్ ఒకేషనల్ విద్యార్థులు బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ ట్రేడ్‌లో భాగంగా పదిరోజులపాటు ఇంటర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బ్యూటీ, లేడీస్ కార్నర్ సంబంధించిన ప్రత్యక్ష అవగాహన, నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ అందించడం జరిగింది. ఇంటర్నెట్‌సెంటర్, మీసేవ, ప్రింటింగ్ ప్రెస్, మొబైల్ హార్డ్‌వేర్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్య కార్యక్రమాన్ని సందర్శించారు. ప్రిన్సిపాల్ జాఫర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నైపుణ్యాలను పెంచుతాయని పరిశ్రమలలో తక్షణ ఉపాధికి మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ పాల్గొన్నారు.

పశువుల నియంత్రణకు చర్యలు

సోమందేపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వారపు సంతలో పశువుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ప్రతివారం సంతలో పశువుల బెడద అధికంగా ఉందని వ్యాపారస్థులు, స్థానికులు సమస్యను తమదృష్టికి తీసుకొచ్చారన్నారు. పశువులు అటు ఇటు తిరుగుతూ జనాన్ని తోసుకుంటూ తిరగడమేకాకుండా వ్యాపార సముదాయాల్లో చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నందున పట్టణంలో దండోర వేయించామన్నారు. పశు వైద్య సిబ్బందిచే వాటి చెవులకు ఉన్న ట్యాగ్ ఆధారంగా యజమానులను హెచ్చరించామన్నారు. మరోమారు పశువులను సంతలో వదిలితే గోశాలకు తరలిస్తామన్నారు.

వాహనాల మళ్లింపు

మండలంలోని వాల్మీకి సర్కిల్‌వద్ద పాత జాతీయ రహదారి పక్కనే ప్రతి వారం సంత జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకుల అభ్యర్థన మేరకు పోలీసులు గురువారం ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. ప్రైవేటు బస్సులు, కియ అనుబంధ పరిశ్రమల బస్సులు, టెంపోలు సంతమార్కెట్‌కు రాకుండా హైవేపై దారి మళ్లించారు. అదే విధంగా వాల్మీకి సర్కిల్‌లో ఇష్టారాజ్యంగా వాహనాలు రోడ్డుపై నిలిపివేయకుండా బందోబస్తు నిర్వహించారు.

గిరి ప్రదక్షిణతో సర్వపాపహరణం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గిరి ప్రదక్షిణతో సర్వపాపహరణం జరుగుతుందని గుడ్డం రంగనాథస్వామి ఆలయ అర్చకుడు గోవిందశర్మ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అతి పురాతన మహిమాన్విత గుడ్డం రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 13న గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి గిరి ప్రదక్షిణ చేయడం జరుగుతుందన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావాలని శ్రీమన్నారాయణ దేవాలయ అభివృద్ధి కమిటీ, ఈఓ నాగేంద్రుడు కోరారు.

మాంసం విక్రయాలు నిషేధం

పావగడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహావీర్, గౌతమ బుద్ధ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజుల్లో తాలూకా వ్యాప్తంగా మాంసం విక్రయాలను నిషేధిస్తున్నట్లు తహసీల్దార్ వరదరాజు తెలిపారు. 12న గౌతమబుద్ధ, 14న అంబేడ్కర్ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. ఈ రోజుల్లో మాంసం దుకాణాలు తెరవకూడదని ఆదేశించారు.

ప్రబలుతున్న క్షయ

పరిశ్రమల ద్వారా వచ్చే పొగవల్లే ఎక్కువగా వ్యాప్తి

కలుషిత వాతావరణమూ కారణమే

చర్యలు తీసుకుంటున్నామంటున్న వైద్యులు



గ్రామాల్లో విచారణ చేపడుతున్న టీబీ యూనిట్ బృందం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. ప్రతి యేడాది వ్యాధిగ్రస్తులు ఎక్కువ అవుతున్నారు. రోగులకు ఎప్పటికప్పుడు మందులను ఇస్తున్నా పట్టణాలు, పల్లెల్లో వ్యాధి లక్షణాలు ఉన్న వారి సంఖ్య ఎక్కువ అవుతోంది. దీర్ఘకాలికంగా దగ్గు, ఊపిరితిత్తుల్లో నెమ్ము ఉండటం, తరచూ జ్వరం రావడం తదితర లక్షణాలుగా పేర్కొంటూ రోగులను గుర్తిస్తున్నారు. ఆ లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు జరిపి వారికి మందులను ఇస్తున్నారు. ఎక్కువ పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా వాయుకాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సైతం క్షయ విస్తరిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే రోగంగా ఉండటంతో బాధితులు ఎక్కువ మంది అవుతున్నారు. అవగాహన లేనికారణంగా క్షయవ్యాధిగ్రస్తులతో ఉంటూ వారి కూడా ఆ రోగబారిన పడుతున్నారు. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న తూమకుంటా, గోళ్లాపురం, సంతేబిదనూరు, కొటిపి, జి గుడ్డంపల్లి, చౌళూరు, హిందూపురం తదితర ప్రాంతాల్లో వ్యాధిలక్షణాలు ఎక్కువగా ఉన్న వారిని గుర్తిస్తున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే పొగ క్షయకు ఒక కారణంగా తెలుస్తోంది. పరిశ్రమల సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లిన సమయంలో లేదా గాలి గ్రామాల వైపు వీచినప్పుడు దీర్ఘకాలికంగా ఆ పొగ పీలుస్తుండటంతో శ్వాసకోస వ్యాధులు తలెత్తుతున్నాయి.

అదేవిధంగా పరిశ్రమల్లో ఎక్కువగా పనిచేయడానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా ఎక్కువ మంది కార్మికులు వస్తుంటారు. వారి నుంచి కూడా క్షయ సంక్రమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు

డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశీలనలు చేస్తున్నారు. పొగ కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని పరిశీలించి గళ్ల పరీక్షలు చేసి మందులు అందించే కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ చేపడుతోంది. అదేవిధంగా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన వారి కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేస్తున్నారు. కలుషిత గాలితో, పరిశ్రమల నుంచి వెలువడే విషపూరితమైన పొగ వ్యాధికి కారణమవుతోందా అనేది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తేల్చాల్సి వుంది. వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మంచి చికిత్సలు అందించడమే కాకుండా వ్యాధి విస్తరణ జరుగకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేక పోతే వ్యాధి విస్తరించి మరింత ఎక్కువ అయ్యే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి సంక్రమించిన తరువాత చర్యలు తీసుకోనేకంటే వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్త పడటమే ఉత్తమమని ఆరోగ్యశాఖ అధికారులు అంటున్నారు.

కాలుష్యం వల్ల ఎక్కువగా వచ్చే అవకాశం

పరిశ్రమలు, ఇటుకల బట్టీలు తదితర ప్రాంతాల్లో పని చేసే కార్మికులకు పరిసర ప్రాంతాల వారికి క్షయవ్యాధి సంక్రమించే అవకాశాలు ఉన్నాయి. పొగను పీల్చడం వల్ల ఊపిరితిత్తులు వ్యాధిబారిన పడుతున్నారు. మద్యం, సిగరేట్ అలవాటు ఉన్నవారికి కూడా వ్యాధి సంక్రమించే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి సంక్రమించినా అవగాహన లేకపోవడం వ్యాధి తీవ్రమవుతున్న తీరుకు నిదర్శనంగా తెలుస్తోంది. వ్యాధి లక్షణాలు ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం ఒక గ్రామాన్ని తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి క్షయవ్యాధి ఉన్న వారిని గుర్తించే కార్యక్రమం చేపట్టాం. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవగాహన కల్పిస్తున్నాం. మందులను ఇస్తున్నాం. వ్యాధి ఉన్న వారు తుమ్మినా, దగ్గినా ఆ సమయంలో తుంపర్లు ఇతరులపై పడినా వారికి వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులు జాగ్రత్తపడాలి. ఇంతకుమునుపు వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.500 ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం రూ. వేయి ఇస్తోంది. ఇప్పటికే చౌళూరు, పరిగి, కేబీహళ్లి, బేవనహళ్లి, బోయపేట, లక్ష్మీపురం, ఇందిరానగర్, ముద్దిరెడ్డిపల్లి, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించి 129 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించి వారికి మందులను ఇస్తున్నాం.

-తిప్పయ్య, జిల్లా క్షయ అధికారి

మహిళల అభివృద్ధి కోసమే కుట్టు శిక్షణ కేంద్రాలు

- మంత్రి సవిత



కుట్టు శిక్షణ కేంద్రంలో మంత్రి సవిత

గోరంట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. గోరంట్ల సచివాలయం-4లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గోరంట్ల పట్టణంలో 4 శిక్షణకేంద్రాలు. వానవోలులో ఒక శిక్షణ కేంద్ర ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మండలంలో 746మంది శిక్షణ పొందడానికి పేర్లను నమోదు చేసుకున్నారని, ఎంత మంది వస్తే అంతమందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. త్వరలోనే తల్లిదీవెన, అన్నదాత సుఖీభవ ఇస్తామని, గోరంట్లలో అన్నక్యాంటీన్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త రేషన్‌కార్డులతోపాటు ఇళ్లు మంజూరుచేస్తామన్నారు. రూ.7.65కోట్లతో 81 సీసీరోడ్లును ఏర్పాటు చేశామన్నారు. బిసి,ఎస్సీ,ఎస్టీ హాస్టళ్ల కేజీబీవీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. మండలంలో తాగునీటికోసం రూ.3.15కోట్లతో ఇంటింటికి కొళాయిలు వేయిస్తున్నామని, గ్రామీణుల కోసం రూ.11 కోట్లతో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అదేవిధంగా సాగునీటికోసం రూ.680కోట్లతో గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రులతో చర్చించామన్నారు. వలస పక్షుల మాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఏపీఓ నాగమణి, బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి రవినాయక్, టీడీపీ సోముశేఖర్, కక్కల రఘు, అశ్వర్థరెడ్డి, నాగేనాయక్, శ్రీధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలపై ఆందోళన



చిలమత్తూరులో ఆటోను లాగుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచిందని సీపీఎం నాయకులు గురువారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక బస్టాండులో వినూత్నంగా నిరసన తెలిపారు. వంట సిలిండర్‌ని నెత్తిన పెట్టుకొని, ఆటోలను తాడుతో లాగుతూ నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ప్రవీణ్, వెంకటేశ్, రామచంద్ర, మంజునాథ్, రహంతుల్లా తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. డీజిల్ ధరలను పెంచడం వలన ఆటో కార్మికుల నుంచి వాహన యజమానులు, అటునుంచి ఆ భారం సామాన్య ప్రజలపై పడుతుందన్నారు. మోదీ ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తరువాత వంట గ్యాస్‌ని పేదలకు అందకుండా పోయిందన్నారు. రూ.250 వంట గ్యాస్‌ని ఏకంగా రూ.900 చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద రహదారిపై సీపీఎం నాయకులు హరి, బాబావలి, కార్యకర్తలు ఖాళీ సిలెండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఒకేసారి పెంచి ప్రజలపై మోయలేని భారం వేసినందన్నారు. అదేవిధంగా పెంచిన విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ప్రజలు, రైతులు, కార్మికులను ఏకంచేసి పెద్దఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాష, గంగాధర్, వెంకటరాముడు, రాజారావు, ఆరిఫ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఈరలక్కప్ప అసమర్థుడు: వైస్ ఎంపీపీ



నరసింహమూర్తి

మడకశిర టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అసమర్థుడని వైస్ ఎంపీపీ నరసింహమూర్తి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈరలక్కప్ప అసమర్థత వల్లే వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు చాలా మంది పార్టీని వీడిపోతున్నారని ఆరోపించారు. రోజు రోజుకీ నియోజకవర్గంలో వైసీపీ బలహీనపడుతోందన్నారు. ఇలాంటి వ్యక్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగితే పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. పంచాయతీ స్థాయి వ్యక్తిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా పెడితే పరిస్థితి ఈవిధంగా ఉంటుందన్నారు. పార్టీ ఇప్పటికైనా పునరాలోచించాలని కోరారు.

ఎరువుల వాడకంపై అవగాహన

లేపాక్షి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేస్తున్న పంటలకు ఎరువులు ఏమోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లేపాక్షి మండలం కల్లూరులో రాగిపంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రసాయన ఎరువులు, పురుగుల నివారణ మందులను వ్యవసాయాధికారుల సూచనమేరకే వాడాలన్నారు. విత్తన ధృవీకరణ ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

పరిగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కోసం స్థానిక ప్రాతికేయులు ఎంపీడీఓ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. సీనియర్ పాత్రికేయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రెస్‌క్లబ్‌లేక చెట్లకింద ప్రెస్‌మీట్‌లు నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారని, ఎంతో మంది నాయకులకు ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరినా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, పాత్రికేయులు పాల్గొన్నారు.

పరీక్షల్లో సత్తాచాటిన విద్యార్థి



నరేంద్ర మోక్షజ్ఞ

పావగడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న నరేంద్ర మోక్షజ్ఞ 2024-25 సంవత్సరానికిగాను 600 మార్కులకుగాను 598 తీసుకుని మొదటి ర్యాంక్ సాధించాడు. తాలూకావ్యాప్తంగా 1 నుంచి 9వ తరగతి వరకు ఏప్రిల్ 10 తేదీన ఫలితాలు ప్రకటించిన అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పరంధామరెడ్డి విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

'అధికారులు చట్ట పరిధిలో పనిచేయండి'

పావగడ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నాయకులకు తొత్తులుగా అధికారులు వ్యవహరిస్తున్నారని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప అన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 494లో 25 ఎకరాల బంజరు భూమిని ఎన్నో ఏళ్లుగా రైతులు సాగుచేస్తున్నారని, ఆ భూమిని వారికే కేటాయించాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు స్పందించలేదన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి వసతి కాలువని నిర్మించడానికి తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం గురువారం భూమిలో కంచె వేయడానికి రావడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో రైతుసంఘం నాయకులు, రైతులు ఘర్షణకు దిగారు. చట్టపరిధిలో పనిచేయాలని కోరారు.

బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

అమరాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని స్కూల్ బస్సు ఢీకొనడంతో యువకుడికి గాయాలయ్యాయి. అమరాపురం నుంచి బసవనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులను దింపి తిరిగి వెళుతున్న స్కూల్ బస్సు కనకనపల్లి గ్రామం దేవి గుడివద్ద ద్విచక్రవాహనంలో వస్తున్న నరసింహమూర్తి అనే యువకుడికి ఢీకొంది. దీంతో అతడికి గాయాలయ్యాయి. వెంటనే ఎస్‌ఐ ఇషాక్‌బాషా, ఏఎస్‌ఐ రామాంజినేయులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉత్సవాల నిర్వహణకు చర్యలు చేపట్టండి

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 13వతేదీ నుంచి 19వతేదీ వరకు నిర్వహించనున్న కనుమ మారమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించారు. గురువారం రాత్రి కొల్లాపురమ్మ దేవాలయ ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి గ్రామపెద్దలు, అధికారులతో ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. దాదాపు 10 సంవత్సరాల అనంతరం నగర పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో మారమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున ఎక్కడ ఎలాంటి చిన్న పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. 14వతేదీన స్వామివారి జలధి మహోత్సవం, 15న జ్యోతుల ఉత్సవం, 16న పోతుల రాజుల కార్యక్రమం, 17,18,19 తేదీలలో ఊరేగింపు, వివిధ కార్యక్రమాల నిర్వహణపై ఎమ్మెల్యే చర్చించారు. పోలీసులు ఎక్కడా చిన్న సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పట్టణ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

'405, 404 జీఓలను రద్దు చేయాలి'

పెనుకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం కలిగించే జీఓ నంబరు 405, 404లను రద్దుచేసి హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నిలుపుదల చేసి కాలువను వెడల్పు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు హంద్రీనీవా కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గురువారం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సీఐటీయు మండల కన్వీనర్ బాబావలి, మహబూబ్‌బాష తదితరులు హంద్రీనీవా కార్యాలయంపై టెక్నికల్ అధికారి ఉస్మాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా ఉమ్మడి అనంత జిల్లాకు 3.45లక్షల ఎకరాలకు నీరు అందుతుందని తాగు, సాగునీరు తీరి జిల్లా సస్యశ్యామలం అవుతుందని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతాంగం ప్రజలకు లైనింగ్ పనులవల్ల తీవ్ర నిరాశ ఎదురవుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన జీవోలు అమలు పూర్తయితే హంద్రీనీవా నిర్దేశిత లక్ష్యం నీరుగారినట్లవుతుందన్నారు. వెంటనే జీవోలు రద్దుచేసి లైనింగ్ పనులు నిలుపుదల చేయాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

చిలమత్తూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ పరిశీలకులు వెంకటేష్ సూచించారు. ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతుల కోసం కంబాలరాయుడు పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఏపీఎస్‌ఓపీసీఏకి చిలమత్తూరు, లేపాక్షి మండలాలు నమోదు చేయడం జరిగింది. అందులో బాగంగా ఆయన గురువారం మండలంలో పర్యటించి రైతులు సేంద్రీయ ఎరువులతో పండించిన పంట పొలాలను పరిశీలించారు. పంటల సాగులో ఎలాంటి ఎరువులు వినియోగించారు? వాటికి పురుగు మందులు వాడారా? ఎంత మోతాదులో వాడారు? విషయాలపై పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులను, పురుగు మందులను సిఫార్సు మేరకు మాత్రమే వాడాలన్నారు. ఆయన వెంట చిలమత్తూరు, లేపాక్షి ఏఓలు వంశీకృష్ణ, శ్రీలత, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మభూషణుడికి సన్మానం చేద్దాం

టీడీపీ నాయకుల తీర్మానం



మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్

హిందూపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డు గ్రహీత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఘనంగా సత్కరిద్దామని టీడీపీ నియోజకవర్గ నాయకులు తీర్మానించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. హిందూపురం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా ఉంటూ పద్మభూషణ్ అవార్డు రావడం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. ఓవైపు సినిమా రంగంలో రాణిస్తూ మరోవైపు రాజకీయంలో రాణిస్తున్నారన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషిచేస్తున్న బాలయ్యకు అవార్డు రావడం నియోజకవర్గ ప్రజలకు రావడమేనన్నారు. ఈనెల 28న ఢిల్లీలో అవార్డు అందుకోనున్నారని, తరువాత హిందూపురంలోని ఎంజీఎం మైదానంలో 25వేల మందితో భారీ బహిరంగసభ ఏర్పాటుచేసి సన్మానం చేద్దామన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, నాయకులు నాగరాజు, అనిల్, మంగేష్, ప్రెస్ వెంకటేశ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, బాచి, షఫీ, దేమకేతేపల్లి అంజినప్ప, మండల కన్వీనర్ జయప్ప, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోతులరాజు బండారు మహోత్సవం

గుడిబండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలిసిన తుమ్మల మారమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం పోతులరాజు బండారు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మోపురుగుండు గ్రామానికి చెందిన పోతులరాజు వివిధ వేషాధారణతో నాట్యం చేస్తూ గుడిబండలో బండారు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి వీక్షించారు. అనంతరం తుమ్మలమారమ్మ అమ్మవారిని దర్శించుకొన్నారు.

నేడు రొద్దంలో విద్యుత్ అంతరాయం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని తురకలాపట్నం, రాగిమేకలపల్లి, పెద్దమంతూరు కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ కరుణాకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

'వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మడకశిర రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మడకశిర ఏరియాఆసుపత్రి డాక్టర్ సురేఖ, కదిరేపల్లి డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రపంచనోటి దినోత్సవం సందర్భంగా గురువారం కదిరేపల్లి గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వ్యాధుల సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గుడిబండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.ఎన్.పాళ్యం గ్రామానికి చెందిన నరేష్‌కు సెల్‌ఫోన్ దొరకడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రాజకుల్లాయప్పకు అందజేశాడు. దీంతో పోలీసులు అతడిని అభినందించారు.